అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 2 సంచిక -95 గురువారం19 జూన్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




6లో.

## ఆపరేషన్ కగార్‌దే పైచేయి !


WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103




## రూ. 3వేలకే ఫాస్టాగ్

# వార్షిక పాస్

- వాహనదారులకు తీపికబురు.. కేంద్రం కీలక ప్రకటన!
- కేంద్రం నుంచి ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్ ప్రకటన
- ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి అమలు
- వార్షిక పాస్ ధర రూ.3000గా ఖరారు
- ఏడాది లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు
- కార్లు, , వ్యాన్ల వంటి నాన్-కమర్షియల్ వాహనాలకు వర్తింపు
- త్వరలో యాక్టివేషన్ లింక్ అందుబాటులోకి

2లో



## మధ్యవర్తిత్వం

# అబద్ధం..!

2లో

వాణిజ్య ఒప్పందమూ వట్టిదే

అమెరికాకు రావాలని కోరిన ట్రంప్

ముందస్తు కార్యక్రమాల వల్లకుదరదన్న మోడీ

క్వాడ్ సదస్సుకు మోడీ ఆహ్వానం ..

## పాక్ ప్రాధేయపడితేనే.. దాడులు ఆపాం..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో ఫోన్లో ప్రధాని మోడీ

**కననాస్కిన్ (కెనడా):** పాకిస్తాన్ ప్రాధేయపడితేనే ఆపరేషన్ సిందూర్ దాడులు ఆపామని, అంతే తప్ప ఎవ్వరి మధ్యవర్తిత్వంతో కాదని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి స్పష్టం చేశారు. భారత్-పాక్ దేశాలు చేసుకున్న సీజ్ ఫైర్ ఒప్పందంలో అమెరికా ప్రమే యం ఎంత మాత్రమూ లేదని పునరుద్ఘాటించారు. ఆపరేషన్ సిందూ ర్ ఇంకా కొనసాగుతున్నదని చెప్పిన మోడీ.. పాకిస్తాన్ బుల్లెట్లకు భారత్ బాంబులతో ప్రతిస్పందిస్తుందని అన్నారు. జీ7 దేశాల శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు కెనడా వచ్చిన ప్రధాని మోడీ.. పలు వురు దేశాధినేతలతో సమావేశమయ్యారు. అయితే, తొలి సెషన్ సమ యంలోనే అమెరికాకు ట్రంప్ అర్ధాంతరంగా వెళ్లిపోవడంతో.. బుధ వారం ఫోన్ చేసి మరీ ట్రంప్ మోడీ సంభాషించారు. వీరి సంభాషణ దాదాపు 35 నిమిషాల పాటు కొనసాగింది. ఈ నేపథ్యంలో దాయాది దేశంతో కాల్పుల విరమణతోపాటు ఇతర అంశాలపై చర్చించేందుకు ఎటువంటి మధ్యవర్తిత్వం అంగీకరించలేదని, భవిష్యత్లో కూడాఅంగీకరించబోమని ట్రంప్కు మోడీ స్పష్టం చేశారు.



## మావోయిస్టులకు మరో

# ఎదురుదెబ్బ

మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్..

ముగ్గురు మావోయిస్టులు మృతి

గాజర్ల రవి అలియాస్ ఉదయ్, అరుణ, అంజు అనే ముగ్గురు మావోలు మృతి

2లో

# బనకచర్లను ఆపేయాలి





కేంద్రాన్ని కోరాలని అఖిలపక్షంలో తీర్మానం

నేడు ఢిల్లీలో కేంద్రజలశక్తి మంత్రిని కలవనున్న సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వెంట ఎంపిల బృందం అఖిలపక్షానికి హాజరైన బిజెపి, బిఆర్ఎస్,ఎంఐఎం పార్టీల ఎంపిలు

రాజకీయ పోరాటంలో న్యాయంజరగకపోతే కోర్టుకు వెళ్తామన్న సిఎం

సమావేశంలోరాజకీయాలు మాట్లాడారంటూ బిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు వాకౌట్

హైదరాబాద్ **జూన్18(జర్నలిస్ట్ వార్త)** బనకచర్ల ప్రాజెక్టును వెంటనే ఆపివేయాలని సచివాలయంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అఖిలపక్షం భేటీలో నిర్ణయించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిని సి.ఆర్ పాటిల్‌ను కలిసి ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో తనతో పాటు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి -బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈ ప్రాజెక్టును నిలుపుదల చేసేందుకు మూడు రకాలుగా ప్రయత్నాలు చేస్తామని సీఎం అన్నారు. **మిగతాది 2లో...**

## కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు



రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి: షర్మిల

2లో

వ్యక్తిగత సంభాషణలు దొంగచాటుగా విన్నారన్న షర్మిల

ఇది వ్యక్తిగత గోప్యతకు, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వ్యాఖ్య



## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

డిజిటల్ భద్రతే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని వెల్లడి

నైపుణ్యాభివృద్ధికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్న సీఎం

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి

**హైదరాబాదజూన్18(జర్నలిస్ట్ వార్త)** హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు

మిగతాది 2లో....

## ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం

సెల్‌ఫోన్ అప్పగించాలన్న ఏసీబీ నోటీసులపై స్పందించిన కేటీఆర్

సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనంపై తీవ్ర అభ్యంతరం

ప్రాథమిక హక్కులు, గోప్యతకు భంగమంటూ లేఖ

సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించిన మాజీ మంత్రి



2లో.

## నిబంధనల ప్రకారం పకడ్బందీగా గురుకులాల నిర్వహణ



డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు

-గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ సర్వీస్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

-గురుకులాల్లో మంజూరైన సీట్లను పూర్తి స్థాయిలో నింపాలి

-ప్రతి గురుకులంలో తప్పనిసరిగా దోమల మెష్ జాలి ఏర్పాటు చేయాలి

3లో.

ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై

రాష్ట్ర బిసి సంక్షేమం, రవాణా శాఖల మంత్రితో కలిసి సమీక్షించిన డిప్యూటీ సిఎం

# హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)
బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ



ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. "ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

# రూ. 3వేలకే ఫాస్టాగ్ వార్షిక పాస్

**న్యూఢిల్లీ,జూన్18(జర్నలిస్ట్ వార్త)**
జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఫాస్టాగ్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా వార్షిక పాస్‌ను తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ప్రైవేటు వాహనదారులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ముఖ్యంగా తరచూ జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

**కేవలం రూ. 3వేలకే ఫాస్టాగ్ వార్షిక పాస్**
ఈ నూతన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. ఈ వార్షిక పాస్ పొందాలనుకునేవారు రూ.3000 చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ పాస్ యాక్టివేట్ చేసుకున్న నాటి నుంచి ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు చెల్లుబాటు అవుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ రెండింటిలో ఏది ముందుగా పూర్తయితే, అప్పటితో పాస్ గడువు ముగుస్తుంది. ప్రస్తుతం ఈ సౌకర్యం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర (నాన్-కమర్షియల్) వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని గడ్కరీ తన పోస్ట్‌లో వివరించారు.
దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జాతీయ రహదారులపై ఈ వార్షిక పాస్ చెల్లుబాటు అవుతుందని కేంద్రమంత్రి తెలిపారు. పాస్‌ను యాక్టివేట్ చేసుకోవడానికి త్వరలోనే ఒక ప్రత్యేక లింక్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు. ఈ లింక్ 'రాజ్‌మార్గ్' యాప్‌తో పాటు ఎన్‌హెచ్ఏఐ (భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ), ఎంఓఆర్‌టీహెచ్ (రహదారి రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ) అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.
ప్రయాణికుల నుంచి చాలాకాలంగా వస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ వార్షిక పాస్‌ను ప్రవేశపెడుతున్నట్లు గడ్కరీ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల టోల్‌ప్లాజాల వద్ద రద్దీ తగ్గడమే కాకుండా టోల్ రుసుముకు సంబంధించిన వివాదాలు కూడా తగ్గుముఖం పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది ప్రైవేటు వాహన యజమానులకు ఇది మరింత సౌకర్యవంతమైన, సులభతరమైన ప్రయాణ అనుభూతిని అందిస్తుందని మంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఫాస్టాగ్ వార్షిక పాస్.. గేమ్‌ఛేంజర్**
**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం**
జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం, భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ 'ఎక్స్ (ట్విట్టర్)' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఫాస్టాగ్ వార్షిక పాస్‌లను ప్రవేశపెట్టాలన్న ప్రయాణికుల చిరకాల డిమాండ్‌కు ఈ నిర్ణయంతో సరైన పరిష్కారం లభించిందని పవన్ పేర్కొన్నారు. టోల్ చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఈ కొత్త విధానం ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "రూ.3000 వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలగడమే కాకుండా, దేశవ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా హైవే ప్రయాణం సాధ్యమవుతుంది" అని జనసేనాని పేర్కొన్నారు. ముఖ్యంగా టోల్ ప్లాజాల సమీపంలో నివసిస్తూ, తరచూ ప్రయాణించే వారికి ఈ విధానం వల్ల సమయంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వానికి ప్రజాపాలన పట్ల ఉన్న నిబద్ధతకు నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం ఒక నిదర్శనమని పవన్ కొనియాడారు. కాగా, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రూ.3000 చెల్లించి ఈ పాస్‌ను పొందవచ్చని ఆయన 'ఎక్స్ (ట్విట్టర్)' లో వెల్లడించారు. గడ్కరీ చేసిన ఈ పోస్టును రీట్వీట్ చేస్తూ పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. అయితే, ప్రస్తుతం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు, వర్తించే నిబంధనలు ఇంకా వెలువడాల్సి ఉంది.

# బనకచర్లను ఆపేయాలి

(మొదటి పేజీ తరువాయి)
టెక్నికల్, పొలిటికల్, లీగల్ ఈ మూడు రకాల ప్రాతిపదికన తమ ప్రయత్నాలను కొనసాగిస్తామన్నారు. పొలిటికల్‌గా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆపడానికి ప్రయత్నిస్తామని, అది సాధ్యం కాని పక్షంలో న్యాయ పోరాటం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గోదావరి కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులపై సమగ్రమైన నివేదిక తయారుచేసి కేంద్రంపై ఒత్తిడికి ఎంపీలకు అవగాహన కల్పించేందుకు ఒక నివేదిక తయారు చేసి అన్ని పార్టీల ప్రతినిధులకు అందించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్‌ను సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టుపై ఒక పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి తెలంగాణలోని అన్ని పార్టీల ఎంపీలను ఆహ్వానించారు. ఈ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో బీజేపీ తరపున డీకే అరుణ, రఘునందన్ రావు, బీఆర్ఎస్ తరపున ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఐఎం తరపున అసదుద్దీన్ ఒవైసీ హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి, రఘురామ్‌రెడ్డి, రఘువీర్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, మల్లు రవి, అనిల్‌కుమార్‌యాదవ్, సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీల నుండి సలహాలు, సూచనలు సేకరించి ప్రాజెక్టును అడ్డుకోవడానికి తదుపరి చర్యలపై ప్రణాళిక ను ప్రభుత్వం రచించనుంది. కేంద్రం ఈ ప్రాజెక్టుకు అనుమతిస్తే సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.
తమ ప్రభుత్వానికి తెలంగాణ రైతాంగ ప్రయోజనాలే ము ఖ్యమని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలు ఎజెండాగా మనం ముం దుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా మనందరం కలిసి పనిచేయాలని కోరారు. రాజకీయ లబ్ది కోసం ఈ స మావేశం ఏర్పాటు చేయలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేంద్ర ప్రభుత్వం 21.-9.-2016 అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసిందని, ఆ సమావేశంలో మొట్టమొదట గోదావరిపై 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని ఆనాటి సీఎం కెసీఆర్ వెల్లడించారని, అసలు ఆ 3వేల టిఎంసిల నీరనే బ్రహ్మ పదార్థం ఎక్కడినుంచి వచ్చిందో ఆపార్టీ వారే వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ సమావేశంలో హరీశ్‌రావు కూడా పాల్గొన్నారని గుర్తు చేశా రు.

# మధ్యవర్తిత్వం అబద్ధం..!

**జూన్18(జర్నలిస్ట్ వార్త)**
కెనడా నుంచి తిరిగి వెళ్తున్న సమయంలో అమెరికా రావాలని మోడీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. అయితే, ముందస్తు షెడ్యూల్ ఉన్న కారణంగా మీ ఆహ్వానాన్ని మన్నించలేనని భారత ప్రధాని వివరించినట్లు విక్రమ్ మిస్త్రీ తెలిపారు. కాగా, త్వర లోనే ద్వైపాక్షికంగా భేటీ అవ్వాలని ఇరు దేశాధినేతలు నిర్ణయించినట్లు చెప్పారు. 'భారత్లో జరిగే క్వాడ్ సమావేశానికి రావాలంటూ మోడీ.. ట్రంప్ను ఆహ్వానించారు. మోడీ ఆహ్వానాన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు' అని మిస్త్రీ చెప్పారు. ఈ ఏడాది చివర్లో క్వాడ్ సమ్మిట్ను భారత్ నిర్వహించే అవకాశం ఉన్నది. చైనా ఆధిపత్యం చెలాయించ దానికి ప్రయత్నిస్తున్న ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నిర్ధారించడంలో క్వాడ్ వ్యూహాత్మక ప్రాముఖ్యతను ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించినట్లుగా తెలుస్తున్నది. కాగా, మూడు దేశాల పర్యటన లో చివరి దశలో భాగంగా మోడీ కెనడా నుంచి క్రొయేషియాకు బయల్దేరి వెళ్లారు. భారత ప్రధాని ఈ బాల్కన్ దేశాన్ని పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. సైనిక చర్యలను నిలిపివేయాలనే నిర్ణయం ఇరుపక్షాల సైన్యాల మధ్య జరిగిన చర్చల సమయంలో తీసుకున్నారని, అమెరికా మధ్యవర్తిత్వం లేకుండానే నేరుగా ఒప్పందం తీసుకున్నారని ట్రంప్తో చెప్పడంతో... కాల్పుల విర మణకు తాను మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ చేసిన వాదనలను తిప్పికొట్టారు. ఈ విషయాలను ట్రంప్కు ఫోన్లో స్పష్టం చేసినట్లు కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. పహల్గాం ఉగ్ర వాద దాడి అనంతరం ట్రంప్.. మోడీకి ఫోన్ చేసి సంతాపం తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత వీరిద్దరూ ఇప్పుడే మాట్లాడుకోవడంతో 'ఆపరేషన్ సిందూర్' వివరాలను అమెరికా అధ్యక్షుడికి మోడీ వివ రించారు. 'పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్-అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చ జరగలేదు. భారత్-పాకిస్తాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వం పైనా చర్చ జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్-పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ ప్రాధేయ పడటంతో ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడే కాదు, ఎప్పు దూభారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోదనే విషయాన్ని ట్రంప్కు మోడీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయంపై భారత్లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉన్నది' అని మిస్త్రీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ -ఇరాన్ మధ్య వివాదం, రష్యా-ఉక్రెయిన్ వివాదం గురించి కూడా ట్రంప్, మోడీ చర్చించారు. వీలైనంత త్వరగా శాంతి కోసం రష్యా -ఉక్రెయిన్ మధ్య ప్రత్యక్ష సంభాషణ అవసరమని, దీని కోసం ప్రయత్నాలు కొనసాగించాలని ఇరువురు నేతలు అంగీకరించారని వ్యక్తం చేశారు.

# కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు

## రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి: షర్మిల

**జూన్18(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ లపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ, "ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?" అంటూ వైఎస్ జగన్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థి అయినందుకే తన వ్యక్తిగత సంభాషణలను కూడా దొంగచాటుగా విన్నారని, ఇది వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు కూడా విఘాతమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఫోన్ ట్యాపింగ్ తతంగం నడిచిందని షర్మిల ఆరోపించారు. "ఒక మహిళ అని కూడా చూడకుండా, ఒక రాజకీయ నాయకురాలిగా నా కార్యకలాపాలను అడ్డుకోవడానికి, నా వ్యూహాలను తెలుసుకోవడానికి ఇంత నీచమైన చర్యలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆమె దుయ్యబట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రత్యర్థులపై నిఘా పెట్టడం, వారి సంభాషణలను రహస్యంగా వినడం వంటివి చట్టవ్యతిరేకమని, నైతికంగా కూడా తప్పని ఆమె స్పష్టం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరిపించాలని, ఇందులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె హితవు పలికారు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమైతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆమె హెచ్చరించారు.
గతంలో వైవీ సుబ్బారెడ్డి సైతం ట్యాపింగ్ విషయాన్ని ధ్రువీకరించి, ఓ ఆడియోను తనకు వినిపించారని షర్మిల వెల్లడించారు. తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకే కేసీఆర్, జగన్ కలిసి ఈ కుట్ర పన్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఘటనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు తక్షణం విచారణను వేగవంతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసీఆర్ కోసం జగన్ తనను రాజకీయంగా అణచివేయాలని చూశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు ఎప్పుడు పిలిచినా తాను హాజరవుతానని స్పష్టం చేశారు.

# మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్..
# ముగ్గురు మావోయిస్టులు మృతి

**న్యూఢిల్లీ, జూన్18(జర్నలిస్ట్ వార్త)** మావోస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఇవాళ తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. చింతకూలు, కొయ్యలగూడెం, కొండమొదలు పరిసర అటవీ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, మావోల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. ఇందులో సెంట్రల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, జోనల్ కమిటీ సభ్యురాలు, ఇటీవల మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత చలపతి భార్య అరుణతో పాటు మరో మావోయిస్టు అంజు ఉన్నారు. ఘటనాస్థలంలో మూడు ఏకే 47 రైఫిల్స్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరి కొంతమంది మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో మారేడుమిల్లి అడవుల్లో గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అజెండా 5ను ఎందుకు దాచారు?

హైదరాబాద్ : బోడిగుండుకు మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడు అని మరోసారి రుజువైందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు పేర్కొన్నా రు. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కెసిఆర్ చెప్పిన వాటిని దురుద్దేశపూర్వకంగా వక్రీకరించారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. రాజకీయ లబ్ది పొందాలనే వక్ర బుద్దే తప్ప,తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన లేదని అన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోని అజెండా 5లోని అంశాలు దాచిపెట్టి, అజెండా నెం.1 అంశాలను మాత్రమే ప్రస్తావించారని విమర్శించారు. గోదావరి -కృష్ణా నదుల అనుసంధానం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని, ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదు అని కెసిఆర్ అజెండా 5లో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం అసత్యాలను సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల ముందు ఉంచారని, ఈ విషయంలో సిఎం మీడియాను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. అబద్దాల పునాదుల మీద జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరు అని హరీష్‌రావు పేర్కొన్నారు.

# ప్రాథమిక హక్కులకు,
# వ్యక్తిగత గోప్యతకు భంగం

**సెల్‌ఫోన్ అప్పగించాలన్న ఏసీబీ నోటీసులపై స్పందించిన కేటీఆర్**
**సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనంపై తీవ్ర అభ్యంతరం**
**ప్రాథమిక హక్కులు, గోప్యతకు భంగమంటూ లేఖ**
**సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించిన మాజీ మంత్రి**



**జూన్18(జర్నలిస్ట్ వార్త)**
ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారానికి సంబంధించి తన సెల్‌ఫోన్‌ను అప్పగించాలంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) జారీ చేసిన నోటీసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన ఏసీబీ అధికారులకు ఒక లేఖ రాశారు. ఫార్ములా-ఈ కార్ రేసు నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ విచారణ జరుపుతున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే కేటీఆర్‌ను కూడా అధికారులు విచారిస్తున్నారు.
విచారణలో భాగంగా కేటీఆర్ వాడుతున్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను తమకు అందజేయాలని ఏసీబీ అధికారులు కోరారు. అయితే, తన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరడం ప్రాథమిక హక్కులకు, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో నొక్కి చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఏసీబీ అధికారుల ఆదేశాలపై కేటీఆర్ తన న్యాయవాదులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ ఫోన్‌ను గానీ, ల్యాప్‌టాప్‌ను గానీ ఏసీబీకి అప్పగించాల్సిన అవసరం లేదని న్యాయనిపుణులు కేటీఆర్‌కు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ న్యాయ సలహా మేరకే కేటీఆర్ ఏసీబీకి లేఖ ద్వారా తన నిర్ణయాన్ని తెలియజేశారు.

# నిబంధనల ప్రకారం పకడ్బందీగా గురుకులాలా నిర్వహణ




**డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు**

**-గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ సర్వీస్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**-గురుకులాల్లో మంజూరైన సీట్లను పూర్తి స్థాయిలో నింపాలి**

**-ప్రతి గురుకులంలో తప్పనిసరిగా దోమల మెష్ జాలి ఏర్పాటు చేయాలి**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై**

**రాష్ట్ర బిసి సంక్షేమం, రవాణా శాఖల మంత్రితో కలిసి సమీక్షించిన డిప్యూటీ సిఎం**



**ఖమ్మంజిల్లా బ్యూరో/జూన్18(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పక్కాగా గురుకులాలను నిర్వహించాలని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అధికారులతో వివిధ పథకాలపై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి సమీక్షించారు.గురుకులాల నిర్వహణ, స్టడీ సర్కిల్ పని తీరు, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా శాఖ, విద్యుత్ శాఖ పని తీరు, చేపట్టిన అభివృద్ధి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి గురుకులాల పాఠశాలల ప్రారంభం నాటికి పిల్లలకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు పంపిణీ చేయాలని, దీనికి అవసరమైన నిధులు ముందుగానే విడుదల చేయడం జరిగిందని అన్నారు. సరైన వసతులు లేని గురుకులాల భవనాలను అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయ భవనాలకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.గురుకుల పాఠశాలల్లో పిల్లలకు దోమలు కుట్టి ఇబ్బంది పడటానికి వీలు లేదని, ప్రతి గురుకులంలో పూర్తి స్థాయిలో మెష్ జాలీ లు ఏర్పాటు చేయాలని అన్నారు. హాస్టల్స్ లో అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని అన్నారు. కామన్ డైట్ ప్రోగ్రాం సంబంధించి షెడ్యూల్ తప్పనిసరిగా డిస్ ప్లే చేయాలని అన్నారు. జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు గురుకులాలను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని, దీనికి సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. గురుకులాల పరిసరాల్లో పండ్ల మొక్కలను పెద్ద స్థాయిలో పెంచాలని, దీనివల్ల పచ్చదనం పెరగడంతో పాటు విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందుతుందని అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో కోటి మొక్కల వరకు పెంచుతున్నామని అన్నారు. ప్రతి మొక్క మీద ప్రభుత్వం కనీసం 300 రూపాయల వరకు ఖర్చు చేస్తుందని, ఒక జిల్లాలో సంవత్సరానికి 300 కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సర్వైవల్ పై శ్రద్ధ పెట్టాలని అన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఎన్ని బ్రతికాయో వాస్తవిక రిపోర్ట్ అందించాలని అన్నారు.గురుకులాల భవనాలకు సంబంధించి రెంట్, డైట్ చార్జీల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేస్తుందని, పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు.

మహిళలకు ఉచిత బస్సు అందించడంతో పాటు అది సౌకర్యవంతంగా ఉండేలా మనం చర్యలు చేపట్టామని, డిమాండ్ ఉన్న రూట్ లలో అదనపు బస్సులు నడపాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నూతన బస్సు రూట్ లను గుర్తించి ప్రతిపాదనలు అందిస్తే నూతన బస్సులు కొనుగోలు చేసి పంపడం జరుగుతుందని అన్నారు. సమీక్ష లో రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గురుకులాలలో చేపట్టిన చర్యలు, గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్లను పంపిణీ, వన మహోత్సవం కార్యక్రమంలో తాటి, ఈత ఖర్జూర మొక్కల పెంపకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

గురుకులాల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గ పర్చాల్సిన అవసరం ఉందని, ఐఐటి, నీట్ వంటి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా శిక్షణ అందించాలని అన్నారు. పెరిగిన డైట్ చార్జీలు వినియోగిస్తూ ప్రభుత్వం సూచించిన కామన్ డైట్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని అన్నారు.

గురుకులాలో మంజూరైన సీట్లు పూర్తి స్థాయిలో నింపాలని, సొంత భవనాలు లేని గురుకులాలకు అవసరమైన భూమి గుర్తించాలని, ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం నిర్మించడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ యువతకు ఖమ్మం జిల్లా హెడ్ క్వార్టర్ లో బీసీ స్టడీ సర్కిల్ నందు శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించేలా చూడాలని అన్నారు. హైదరాబాద్ కు రావాల్సిన అవసరం లేకుండా అవసరమైన అన్ని రకాల పుస్తకాలు, శిక్షణ మన ఖమ్మంలో అందించాలని అన్నారు. ప్రస్తుత సంవత్సరం వన మహోత్సవం కార్యక్రమంలో 81 వేల ఈత మొక్కలు నాటేందుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలని, గీత కార్మికుల సొసైటీ లను వీటిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేస్తూ కాలువల వెంబడి, ఖాళీ ఉన్న ప్రభుత్వ స్థలాల్లో వీటిని పెద్ద ఎత్తున పెంచాలని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత నూతన బస్సు సర్వీసుల కోసం డిమాండ్ వస్తుందని,స్థానిక ఎమ్మెల్యేల నుంచి బస్సు సర్వీసుల ప్రతిపాదనలు తీసుకొని అందించాలని, డిమాండ్ కు అనుగుణంగా అదనపు బస్సులను కేటాయిస్తామని, రాబోయే రోజులలో హైదరాబాద్ కు



ఎలక్ట్రిక్ బస్సులు వచ్చే నేపథ్యంలో జిల్లాలకు అదనపు బస్సులు అందుతాయని మంత్రి తెలిపారు. నగర పరిధిలో పీఎంఈ స్కీం కింద ఎలక్ట్రిక్ బస్సుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పరిశీలించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రూరల్ కనెక్టివిటీ బస్సుపై స్టడీ చేసి నూతన రూట్ లను ప్రతిపాదించాలని అన్నారు. లాండ్రీ లకు, దోబి ఘాట్, సెలూన్ లకు విద్యుత్ సరఫరా సజావుగా అందాలని అన్నారు. గురుకులాల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళా చైర్మన్ నాయుడు సత్యనారాయణ, నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ నవీన జ్యోతి ని కలిసిన హ్యూమన్ రైట్స్ సొసైటీ టీమ్.






**వైరా/జూన్18(జర్నలిస్ట్ వార్త):** వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవీన జ్యోతి ని హ్యూమన్ రైట్స్ సొసైటీ బృందం బుధవారం మర్యాదపూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం మాట్లాడుతూ ఈ సొసైటీలో ప్రతి సభ్యుడు వారి వారి వృత్తులను వారు చేసుకుంటూ సామాజిక దృక్పథంతో కొంత సమయాన్ని మానవ హక్కులను ప్రచారం చేయడానికి స్వచ్ఛందంగా కేటాయిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ కళాశాలలో చదువుచున్న విద్యార్థులకు విద్యా హక్కు చట్టం, డ్రగ్స్, మైనర్ డ్రైవింగ్, బాల్య వివాహాలు మొదలుగు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని ఆమెకు తెలియజేసారు. ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాల ఆల్బమ్ ను చూపించి, మాకు సహకరించాలని కోరారు. ప్రిన్సిపాల్ నవీన జ్యోతి మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ సొసైటీ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో అడ్మిషన్స్ పెంచేందుకు మీ వంతు కర్తవ్యంగా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్ బాబు, హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిల్లిముంత వెంకటేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్ కువ్వారపు విజయరావు, వైరా మండల అధ్యక్షురాలు బుడిగి సునీత, కొణిజర్ల మండల అధ్యక్షులు కొమ్ము భద్రయ్య, తల్లాడ మండల అధ్యక్షులు ఆదూరి బాబురావు, సొసైటీ సలహాదారులు ఆదూరి రవి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆఫ్ టైప్ మొక్కలకు పరిహారం చెల్లించకపోతే ఆందోళనలు చేస్తాం




**సత్తుపల్లి/జూన్18(జర్నలిస్ట్ వార్త):** ఆయిల్ ఫామ్ సాగులో ఆఫ్ టైప్ మొక్కలు వచ్చిన రైతులకు పరిహారం చెల్లించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ హెచ్చరించారు.బుధవారం సత్తుపల్లి, వెం సూర్,దమ్మపేట, మండలాల్లోనీ ఆయిల్ పామ్ తోటలు ను పరిశీలించి ఆ తర్వాత రేగల్లపాడు లో ఉన్న ఆయిల్ పామ్ నర్సరీ నీ సంఘం ప్రతినిధులు పరిశీలించారు.అనంతరం సత్తుపల్లి లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మళ్ళీ మళ్ళీ ఇలాంటి సంఘటనలు జరగకుండా సరైన చర్యలు తీసుకోవాలని, ఆఫ్ టైప్ మొక్కలు వచ్చిన రైతులకు పరిహారం కచ్చితంగా ఇవ్వాలని, అదేవిధంగా పామ్ ఆయిల్ మద్దతు ధర ను రూ.25వేలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశం లో పలువురు రైతులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ సన్మాన సభను విజయవంతం చేయాలి



**ధర్మసాగర్/జూన్18(జర్నలిస్ట్ వార్త):** మందకృష్ణ మాదిగ సన్మానం విహెచ్ పిఎస్ జాతీయ కార్యదర్శి గడ్డం కాసిం అన్నారు ధర్మసాగర్ బుధవారం మండల అధికార ప్రతినిధి గంటే లక్ష్మి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విహెచ్ పిఎస్ జాతీయ కార్యదర్శి గడ్డం కాసిం పాల్గొని మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు ను స్వీకరించిన సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం శుభం కన్వెన్షన్ హాల్ నాగోల్ హైదరాబాదులో నిర్వహించబడును కావున ధర్మసాగర్ మండల కేంద్రంలోని వికలాంగులు అందరు హాజరై ఆ యొక్క సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బొట్ల సురేష్ పిఎస్ జాతీయ నాయకులు,బొడ్డు రమణాకర్ మండల ప్రధాన కార్యదర్శి,మాచర్ల సంధ్యారాణి ఆరూరి లత గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి,బొడ్డు శాంతి సార్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు

## జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

### పర్వతగిరి మండల ఇంచార్జ్ గోలి సుధాకర్



**పర్వతగిరి/జూన్18(జర్నలిస్ట్ వార్త):** జులై 7న ఎమ్మార్పీఎస్ 31 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని పర్వతగిరి మండల ఇంచార్జ్ గోలి సుధాకర్ మాదిగ అన్నారు. బుధవారం బురుగుండ్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన కమిటీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బర్ల యాకయ్య మాదిగ అధ్యక్షతన నిర్వహించగా దీనికి ముఖ్య అతిథులుగా పర్వతగిరి మండల ఇంచార్జ్ గోలి సుధాకర్ మాదిగ హాజరై మాట్లాడుతూ జులై 7న ఎమ్మార్పీఎస్ 31 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం,మన మాదిగలకు ఆత్మగౌరవం తీసుకొచ్చిన మాదిగల మహాత్ముడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో రాపాక శ్రీనివాస్ మాదిగ చెరుకూరి కుమార్ స్వామి మాదిగ రాపాక రాములు మాదిగ చెరుకూరి అజయ్ మాదిగ రాపాక అఖిల్ మాదిగ రాపాక ప్రవీణ్ మాదిగ రాపాక వంశీ మాదిగ సిరిపురం శ్రీధర్ మాదిగ ఈదురు దేవేందర్ మాదిగ రాపాక అనిల్ మాదిగ రాపాక వెంకన్న మాదిగ రాపాక స్వామి మాదిగ రాపాక ముత్యాలు మాదిగ రాపాక వంశ మాదిగ తదితరులు పాల్గొన్నారు

## భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వం లక్ష్యం



**తల్లాడ/జూన్18/జర్నలిస్ట్ వార్త):** భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వం లక్ష్యం ఆర్డీవో రాజేంద్ర గౌడ్ అన్నారు.బుధవారం తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో రైతు వేదిక లో భూ భారతి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారుఈ సందర్భంగా కల్లూరు ఆర్డీవో రాజేంద్ర గౌడ్ మాట్లాడుతూ,రైతుల భూ సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ప్రతి ఒక్కరు భూ భారతి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సురేష్ బాబు, ఆర్ఐ కాజా మహాయుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కంపూడి కిషోర్,దీవె ల కృష్ణయ్య, సామినేని రామ్ అప్పారావు, జక్కంపూడి రమేష్, పంచాయతీ కార్యదర్శి, సాయికుమార్, ఏవో మాధవి , ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ, పంచాయతీ గుమస్తా నల్లగట్ల లాజర్, పంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంతి భవనం ఏర్పాటుకు వినతి



**కల్లూరు/జూన్18( జర్నలిస్ట్ వార్త):** మున్సిపాలిటీలో లో గల మార్కెట్ యార్డ్ నందు నూతన విశ్రాంతి భవన ఏర్పాటు చేయాలని బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కు వినతి పత్రం అందించిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్.మార్కెట్ యార్డ్ నందు నూతన విశ్రాంతి భవన ఏర్పాటు చేయాలని వినతి ని తెలియజేయగా వెంటనే స్పందించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు అతి త్వరలో నే విశ్రాంతి భవనాలకు అనుమతులు ఇస్తాను అని హామీ ఇవ్వటం జరిగిందిఅని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమం లో కల్లూరు మండలం కాంగ్రెస్ నాయకులు బాగం ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన
# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నర్సంపేట/జూన్18(జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలో ఇటీవల మృతి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బుధవారంపరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 8 వార్డు స్థానికులు వేల్పుల సాంబయ్య ఇటీవల మృతి చెందాగా వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి. వారి కుటుంబ సభ్యులను.కుమారుడు వేల్పుల శ్రీధర్ ని కుటుంబ బాగోగులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు.శాంతినగర్ 7వ వార్డు స్థానికులు గద్దల కొమురయ్య చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు వారి కుటుంబ సభ్యులు ముగ్గురు కుమారులను పరమర్శించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు నాగేల్లి వెంకటనారాయణ గౌడ్ పట్టణ ప్రచార కార్యదర్శి,మాజీ కౌన్సిలర్స్ మండల శ్రీనివాస్, బండి ప్రవీణ్, పెండెం వెంకటేశ్వర్లు, గందె చంద్రమౌళి, ఆకుల ప్రభాకర్, జన్ను సురేందర్, కందికొండ శ్రీను, బగ్గి రాజు, రాజేందర్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిసిన
# ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి








**ఖమ్మం/జూన్18(జర్నలిస్ట్ వార్త):**
ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరికి డిప్యూటీ సీఎం శుభాకాంక్షలు తెలియజేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రిగా నియామకమైన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ని కలిశానని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు ఖమ్మం పర్యటనలో ఉన్నారని తెలుసుకొని హైదరాబాద్ నుంచి వచ్చి మర్యాద పూర్వకంగా కలిశానని క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇంచార్జి మంత్రి మీడియా ప్రతినిధులకు తెలిపారు. త్వరలో ఖమ్మం జిల్లాకు సంబంధించిన ముగ్గురు మంత్రులతో సంప్రదించి ఒక తేదీ ఖరారు చేసుకుని, జిల్లా సమీక్షా సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. అంతకుముందు ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు వాకిటి శ్రీహరిని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లు మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

# అంగరంగ వైభవంగా శ్రీ విజ్ఞేశ్వర కళాక్షేత్రం కల్చరల్ ఆర్ట్స్ టైం ఫెస్టివల్

**పర్వతగిరి/జూన్18(జర్నలిస్ట్ వార్త):**




తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ విజ్ఞేశ్వర కళాక్షేత్రం ఆధ్వర్యంలో కల్చరల్ ఆర్ట్స్ టైం ఫెస్టివల్ (150 ) మంది కళాకారులతో బుధవారం మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. అదరగొట్టిన డప్పుల నృత్యాలు,ఒగ్గుడోళ్లు విన్యాసాలు,మహిళల బోనాల కోలాటాలు,చిందు యక్షగానాలు, శారద కళలు, ముందు తరాలకు ఆదర్శంగా అందించాలని కల్చరల్ ఆర్ట్ టైం ఫెస్టివల్. ఓరుగల్లు గడ్డమీద కళాకారుల సాంస్కృతిక వైభవం. కళలకు కళాకారులకు పుట్టినిల్లు ఓరుగల్లు మంత్రివర్యులు కొండ సురేఖ,శాసన సభ్యులు శ్రీ కె ఆర్ నాగరాజు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. తెలంగాణ కళలని ప్రోత్సహించే భాషా సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు సంచాలకులు డా మామిడి హరికృష్ణ గారికి ధన్యవాదాలు తెలిపిన కార్య నిర్వాహకులు ప్రశాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు

# నేడే క్రీడా పాఠశాలలు ఎంపిక

**కల్లూరు/జూన్18(జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి, ఖమ్మం జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో నేడు గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం క్రీడా ప్రాంగణములో కల్లూరు మండల స్థాయి క్రీడా పాఠశాలల ఎంపికలు నిర్వహించటం జరుగుచున్నదని మండల విద్యాశాఖ అధికారిని పత్తిపాటి నివేదిత అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం ఆన్లైన్ చేసిన వారు చేయకుండా ఎవరైనా పిల్లలు ఇంట్రెస్ట్ ఉంటే తగిన అర్హత పత్రాలు తీసుకుని వచ్చినట్లయితే స్పాట్ అడ్మిషన్ చేసుకోవాలన్నారు. కావలసినది 1. బర్త్ సర్టిఫికెట్ 2. స్కూల్ స్టడీ సర్టిఫికెట్ నాలుగో తరగతి చదువుతున్నట్లు 3. ఆధార్ కార్డ్ 4. టు పాస్పోర్ట్ సైజ్ ఫోటోస్. వీటిని వెంట తీసుకొని రావలెను 01.09.2016.నుండి 31.08.2017. మధ్య జన్మించి అర్హత పత్రములుతీసుకొని వచ్చిన వారిని మాత్రమే ఆటలలో ఆడుటకు అర్హులు. ప్రభుత్వ పాఠశాలలలో నాలుగో తరగతి చదివేవారు ప్రైవేటు




పాఠశాలలలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో చదివే వారు మాత్రమే అర్హులు. ఈ క్రీడా పాఠశాల ఎంపికల బాధ్యతలను కల్లూరు మండల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వ్యాయామ దర్శకులు వ్యాయామ ఉపాధ్యాయులు అందరి యొక్క సహాయ సహకారములతో నిర్వహించుచున్నాము అని తెలిపారు. మండల వ్యాయామ ఉపాధ్యాయులు వ్యాయామ దర్శకులు ఉదయం 8:30 వరకు కల్లూరు మినీ స్టేడియంలో నందు హాజరు కాగలరు. మండల వ్యాయామ విద్యా విభాగం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావలన్నారు. బ్యాటరీ టెస్ట్ 9 ఈవెంట్లు చేయవలెను.. వివరాల కొరకు ఈ9440669401. సంప్రదిచలన్నారు.

# అట్టహాసంగా ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ

**-అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతాయి**

**-ఇందిరమ్మ రాజ్యంలో పేదల స్వంత ఇంటి కల నెరవేరబోతుంది.**

**-ఇల్లు మంజూరు అయిన వాళ్ళు దసరా నాటికీ గృహ ప్రవేశం చేయాలి**



**పర్వతగిరి/జూన్18(జర్నలిస్ట్ వార్త):**
ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల స్వంత ఇంటి కల సాకారం అవుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు అన్నారు.బుధవారం పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పర్వతగిరి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమిపూజ ముగ్గుపోసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు బట్టలు పెట్టి ఆశీర్వదించి నిర్ణీత కాల వ్యవధిలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. మొదటి విడతలో రాని వాళ్లకు రెండవ విడతలో అవకాశం వస్తుందని వివరించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధైర్యపడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇచ్చే బాధ్యత మది అని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పరిపాలనలో ఇప్పుడు ఎక్కడ అవినీతికి ఆస్కారం లేకుండా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలనే సంకల్పంతో పని చేస్తున్నం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జటోత్ శ్రీనివాస్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కూసం రామచందర్, సీనియర్ నాయకులు ఇందిరమ్మ కమిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు,మహిళలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంఘం భూమి కబ్జా పై విచారణ

**పర్వతగిరి/జూన్18(జర్నలిస్ట్ వార్త):**



మండలంలోని కల్లెడ గ్రామంలో గౌడ సంఘం భూమి 4.01 ఎకరాల భూమి కబ్జాకు గురైందని కలెక్టరేట్లో సోమవారం జరిగిన ప్రజావాణి లో కొందరు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు తో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం వరంగల్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపర్డెంట్ మురళీధర్ ఆధ్వర్యంలో కల్లెడలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గౌడ సంఘ సభ్యులు మా భూమి కబ్జాకు, ఆక్రమణకు గురి కాలేదని, 2019లోనే సంఘం అవసరార్థం భూమిని అమ్ముకోవడం జరిగిందని రాతపూర్వకంగా సభ్యులు విన్నవించుకున్నారు. సంఘం సభ్యుల నుంచి వాంగ్మూలం తీసుకున్న అధికారులు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. మురళీధర్ వెంట వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప, సిబ్బంది ఉన్నారు.

# సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన




**పర్వతగిరి/జూన్18(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ కాంప్లెక్స్ ప్రాంగణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్చరల్ ఆర్ట్స్ టైం ఫెస్టివల్ ను 150 మంది కళాకారులతో భారీ ప్రదర్శనలు శ్రీ విజ్ఞేశ్వర కళాక్షేత్రం సారథ్యంలో బుధవారం నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు డప్పుల నృత్యాలు,ఒగ్గుడోళ్లు విన్యాసాలు,మహిళల బోనాల కోలాటాలు,చిందు యక్షగానాలు,శారద కళలు స్థానికులకు తెలంగాణ మట్టి కళల వైభవాన్ని ప్రతిబించేలా భారీ ఎత్తున సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. ముందు తరాలకు ఆదర్శంగా ఇలాంటి కలలు కల్చరల్ ఆర్ట్ టైం ఫెస్టివల్ ద్వారా అందించడం చాలా సంతోషకరమని తెలిపారు.ఓరుగల్లు గడ్డమీద కళాకారుల సాంస్కృతిక వైభవం ద్వారా కళలకు కళాకారులకు పుట్టినిల్లు ఓరుగల్లు అనే సందేశాన్ని వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ఓరుగల్లు ముద్దుబిడ్డ తెలంగాణ మంత్రి
మంత్రి కొండ వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య హాజరై మాట్లాడుతూ తెలంగాణ కళలని ప్రోత్సహించే భాషా సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి సాంస్కృతిక ప్రదర్శనలు చేయడం చాలా గర్వకారణమని ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రశాంత్ సతీష్ లతో పాటు డప్పు కళాకారులు చిన్నపాక వెంకటయ్య తో పాటు గడ్డం బ్రహ్మ గడ్డం విష్ణు స్థానికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులతో ఆనందం

## -సాగుకు మొదలవుతున్న అన్నదాతలు

**భూపాలపల్లి/జూన్18(జర్నలిస్ట్ వార్త):** రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత మరోసారి రైతు భరోసా నిధుల విడుదలతో వెల్లడైంది. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న ఈ సమయంలో రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేలా ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ నిధుల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు అవసరాలకు సంబంధించి రైతులకు మద్దతు లభించనుండటంతో, చాలా మంది రైతులు ముందుగానే అవసరమైన వ్యవసాయ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ విధంగా విత్తనాల సేకరణకు ముందు రైతులకు రైతు భరోసా నిధులు అందడం ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా నిధుల విడుదల ద్వారా ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు. సాగులో జాప్యం కాకుండా సకాలంలో సహాయం అందించడం అభినందనీయమని రైతులు పేర్కొన్నారు.రైతు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కొనసాగిస్తున్న చర్యలు భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, లాభదాయకంగా మార్చనున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లాలో ఇప్పటి వరకు 90,837 మంది రైతులకు 72,30,42,624 రూపాయల నిధులు విజయవంతంగా జమయ్యాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు



పాత రైతులతో పాటు కొత్త రైతులకు కూడా రైతు భరోసా ను ఎలాంటి పరిమితులు విధించకుండా అందించాలని ప్రభుత్వం నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు ఈ నెల 20వ తేదీ వరకు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి రైతు భరోసా అందజేస్తామని ఆయన తెలిపారు

### వానకాలం 2025 రైతు భరోసా నిధుల పంపిణీపై మండలాల వారీగా వివరాలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వానకాలం – 2025కు సంబంధించిన రైతు భరోసా నిధుల పంపిణీ



As On Date: 6/18/2025 8:30:01 AM

| | Mandal | No.of Villages | Total(Far) | Total(Amt) | Sent to Treasury Farmers | Sent to Treasury Amount | DBT Succ… Farmers | Amo… |
|---|---|---|---|---|---|---|---|---|
| PALLY | BHUPALPALLY | 28 | 13833 | 148270737 | 11304 | 112166426 | 9588 | |
| PALLY | CHITYAL | 16 | 13785 | 161991487 | 12453 | 135908052 | 10292 | |
| PALLY | GHANAPUR MULUG | 9 | 9129 | 97339203 | 7757 | 73737536 | 6666 | |
| PALLY | Kothapallegori | 7 | 7251 | 65892831 | 6876 | 61008328 | 6203 | |
| PALLY | MOGULLAPALLE | 17 | 12609 | 134709882 | 11643 | 119168078 | 9749 | |
| PALLY | REGONDA | 11 | 12427 | 128632693 | 11606 | 113154360 | 9947 | |
| PALLY | TEKUMATLA | 18 | 10995 | 110807259 | 9754 | 94333142 | 8339 | |
| VPUR | KATARAM | 33 | 12335 | 158820046 | 10410 | 112432506 | 8566 | |
| VPUR | MAHADEVPUR | 38 | 7493 | 86364189 | 6213 | 66655128 | 5080 | |
| VPUR | MALHARRAO | 26 | 10053 | 133013332 | 8631 | 98549826 | 6924 | |
| VPUR | MUTHARAM MAHADEVPUR | 50 | 12034 | 178980331 | 10464 | 134453618 | 7897 | |
| VPUR | PALIMELA | 29 | 2453 | 35084155 | 2001 | 23500074 | 1586 | |
| | Total | 282 | 124397 | 1439906145 | 109112 | 1145067074 | 90837 | |

District Agricult… Jayashankar

విజయవంతంగా కొనసాగుతోంది. మొత్తం 282 గ్రామాల నుంచి 1,24,397 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు అర్హులుగా గుర్తించబడ్డారు. ఇందుకోసం 143,99,06,145 రూపాయల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయడానికి చర్యలు తీసుకోగా, అందులో 114,50,67,074 రూపాయలు ఖజానా ద్వారా పంపిణీకి సంబంధించి నమోదయ్యారు. కాగా ఇప్పటి వరకు 90,837 మంది రైతులకు 72,30,42,624 రూపాయల నిధులు విజయవంతంగా జమయ్యాయి.
ఈ కార్యక్రమం రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు నిదర్శనమని, వ్యవసాయ అధికారులు మరియు బ్యాంకర్లు సమన్వయంతో ఈ పంపిణీ సమర్థవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

# క్రీడా పాఠశాలల ప్రవేశాలకు మండల స్థాయి ఎంపికలు



**పర్వతగిరి/జూన్18(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి గాను క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కొరకు విడుదల చేసిన నోటిఫికేషన్ కు అప్లై చేసుకున్న విద్యార్థులకు ఈరోజు ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు గా పర్వతగిరి మండల విద్యా శాఖ అధికారి గాయపు లింగారెడ్డి తెలిపారు. ఆర్ డి ఎఫ్ కల్లెడ పాఠశాలలో విద్యార్థులకు నిర్ణయించబడిన అంశాలలో పరీక్షలు నిర్వహించి ఎంపికలు చేశారు. ఈ కార్యక్రమానికి పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించబడతాయని జిల్లాస్థాయిలో ఎంపిక కాబడ్డ విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ఎంపికలు నిర్వహించి అనంతరం క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పిఈటి అసోసియేషన్ అధ్యక్షులు మన్నం వెంకటేశ్వర్లు, పర్వతగిరి మండల ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ) లు మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (ఈ టీ లు) అనిల్ కుమార్, ఎండీ పాషా, విజయలక్ష్మి, సురేష్, చందూలాల్, స్రవంతి, స్వప్న, అపర్ణ, కవిత, రాజు, వేణు ఆర్ డి ఎఫ్ కల్లెడ పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాస్ ఆర్డీఎఫ్ కాలేజ్ ప్రిన్సిపల్ జనార్ధన్ ఎమ్మార్సి సీసీవో జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పల్లెబాట

### -టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి



**రాయపర్తి/జూన్18(జర్నలిస్ట్ వార్త):**ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పల్లెబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి, దర్యా తండ గ్రామాలలో నిర్వహించిన పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సిరాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పల్లెబాట ద్వారా ప్రజల గడపకు చేరి వారి మనసును తెలుసుకోవడమే మా ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారాలు కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గ్రామాలలో ఉన్న రహదారి తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో చర్చించి పరిష్కారం చూపుతామని అన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషితో నియోజక పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పాలకుర్తి సోమేశ్వర్ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ కృష్ణమాచారి,ఆకుల సురేందర్ రావు,డైరెక్టర్ మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు నంగునూరి అశోక్, మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, మందాటి సుదర్శన్ రెడ్డి, పాల్వంచ కోటేశ్వర్, మచ్చ నిలయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి

### -మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్



**రాయపర్తి/జూన్18(జర్నలిస్ట్ వార్త):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల పనిచేసి బిఆర్ఎస్ పార్టీ సత్తా చూపాలి అని మాజీ జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కాట్రపల్లి,కొండూరు గ్రామాలలో స్థానిక సంస్థలఎన్నికల నిర్వహణ కొరకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు దిశగా అందరు కలిసి పనిచేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, బోనగిరి ఎల్లయ్య, బద్దం వేణుగోపాల్ రెడ్డి, మండల శ్రీధర్, దేశ బోయిన ఉపేందర్,అశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి, చందు సతీష్, ఉబ్బని సింహాద్రి, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి నేరెళ్ల మహేష్, మాజీ ఉప సర్పంచ్ కొమ్ము రాజు, పార్టీ ముఖ్య నాయకులు సత్యనారాయణ రావు, పులి సోమయ్య, పూస వెంకటయ్య, నేరెళ్ల రాములు, పూస కుమార్, నాగిరెడ్డి,పెండ్లి వెంకన్న, కాసారం రాంరెడ్డి, చౌద దేవేందర్, కల్పగిరి వెంకటయ్య, గూడూరు రమేష్, పెండ్లి నరేష్, ఓరుగంటి యాకయ్య, రామరాపు సంజీవ, ల్యాదెళ్ల ప్రశాంత్, పుల్ల శ్రీను, కొమ్ము కుమార్, రాకేష్, కుమార్, ప్రసాద్, అడ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే జీఎస్సార్



**గణపురం/జూన్18(జర్నలిస్ట్ వార్త):** మండలం కేంద్రంలోని వడ్లకొండ నారాయణ గౌడ్ మనవరాలి, బండి గోపి కూతురి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకలో,భూపాలపల్లి టౌన్ లోని క్రిష్ణ కాలనీ సింగరేణి చిన్నార్మినీ ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగిన రేగొండ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన పన్నాటి శ్రీనివాస్ మనవరాలి పుట్టిన రోజు వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన గౌరవ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సి పి ఐ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ను పరామర్శించారు. అనంతరం భూపాలపల్లి టౌన్ లో రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న సి పి ఐ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి ,ఏ ఐ టి యు సి జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్ కుమార్ గారి ఇంటికి వెళ్లి రాజ్ కుమార్ గారిని పరామర్శించి అతని యోగ క్షేమాల గూర్చి తెలుసుకొన్న గౌరవ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. ఎమ్మెల్యే వెంట టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ సేవలను వినియోగించుకోవాలి



**పర్వతగిరి/జూన్18(జర్నలిస్ట్ వార్త):** పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని వరంగల్ నార్త్ పోస్టల్ ఇన్స్పెక్టర్ ఎల్. సైదా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డీసీడీపీ (డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం) లో ఎంఓ వేణుగోపాల్ పాల్గొని పోస్టల్ సేవల గురించి వివరించారు. విలేజిలో ఉండే చివరి వ్యక్తి వరకు పోస్టల్ పథకాలు తెలియజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

## హాస్టల్ లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**పర్వతగిరి/జూన్18(జర్నలిస్ట్ వార్త):**విద్యార్థుల సంక్షేమము కోసం ప్రేమెట్రిక్ వసతి గృహాల్లో ప్రత్యేక సదుపాయాలను ఖర్చు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని ఎస్సీ బాలుర వసతి గృహం అధికారి కంజర్ల రవికుమార్ తెలిపారు. తమ హాస్టల్ లో బుధవారం ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరణను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్లో సన్న బియ్యం తో కూడిన భోజనం, నాణ్యమైన విద్య, పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్ పంపిణీ, ప్రతి విద్యార్థి కి కాస్మోటిక్స్ చార్జీలు 3%rd to 7th% వరకు రూ.150, 8%th to 10th% రూ.200 నెలకు విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుంది. అలాగే నెలలో ఒకసారి మెడికల్ క్యాంప్, స్కూలు దుస్తులు, పుస్తకాలు, నోట్ బుక్స్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కావున ఎస్సీ బాలుర వసతి గృహం పర్వతగిరి లో అడ్మిషన్స్ పొందలని కుంటునవారు, తల్లి దండ్రులు ఇట్టి ఫోన్ నెంబర్లను సంప్రదించి విద్యార్థులకు ఆడిషన్స్ పొందగలరని అన్నారు. 9848920914, 7396285859.

## జిల్లా స్థాయి క్రీడ పోటీలకు ఎంపికైన ఎంపీపీఎస్ విద్యార్థులు



**రాయపర్తి/జూన్18(జర్నలిస్ట్ వార్త):**మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు క్రీడ పాఠశాలలో ప్రవేశం కోసం బుధవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు హర్షిత, ఇస్సాక్ పాల్,అర్చన, మాధురి,అశ్విక,హర్షిత్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వాతి,శ్రీదేవి, లక్ష్మీ,మురళీ, వివేక్, నరేష్,రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయానికి పూజా సామాగ్రి అందజేత



**గణపురం/జూన్18(జర్నలిస్ట్ వార్త):** గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారికి ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజ నిర్వహించారు గణపురం మండల కేంద్రంలోని సోమేశ్వర మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు పబ్బ. వర్షిని. రాకేష్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు పూజ అనంతరం రాకేష్.వర్షిని దంపతులు 3.000 రూపాయలతో నిత్య ధూప దీప సంబంధించిన పూజా సామాగ్రిని ఆలయ అర్చకులు కి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన గౌడ్ కమిటీ సభ్యులు బండారు శంకర్ మూల శ్రీనివాస్ గౌడ్ బాటిక స్వామి మాదాసు అర్జున్ మాదాసు మొగిలి బూర రాజగోపాల్ పాండవుల భద్రయ్య దయ్యాల భద్రయ్య ఉయ్యాల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# డిసిసి బ్యాంకు నూతన బ్రాంచ్, గోదాంను ప్రారంభించిన

## వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**ధర్మసాగర్/జూన్18(జర్నలిస్ట్ వార్త):**
రైతు సంక్షేమమే ధ్యేయంగా ఒక్క ఆర్థిక సంవతంలోనే వ్యవసాయ రంగానికి 30వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికే దక్కుతుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 2వేల మెట్రిక్ టన్నుల గోదాం, డీసిసి బ్యాంక్ ధర్మసాగర్ బ్రాంచ్ నూతన భవనం, కామన్ సర్వీస్ సెంటర్, గోదాం ప్రారంబొత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నెని రవీందర్ రావు గారితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిలుగా బుధవారం పాల్గొని ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు శ్రేయస్సు కోసం పాటుపడుతున్న విషయాన్ని రైతులు గుర్తించాలని కోరారు. ఒక్క ఏడాదిలోనే 25లక్షల మంది రైతులకు 21వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం ఆకలితో ఉండకూడదు అని రేషన్ షాప్ ల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని అన్నారు. సన్నాలు పండించే రైతులను ప్రోత్సహించాలని 500బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా ద్వారా ఇప్పటి వరకు 40లక్షల మంది రైతులకు 4వేల కోట్లు బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యాయని రానున్న వారం రోజులలో 90లక్షల మంది రైతులకు 9వేల కోట్లు అందనున్నాయని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ మొతంగా 30వేల కోట్లు కేటాయించిందని వివరించారు. రైతులకు అండగా ఉంటూ రైతు సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుంది అనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రజలకు అవినీతి రహితమైన పాలన అందించడం, నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు సహకరించాలని కోరారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో డీసిసి బ్యాంక్ సేవలను, పీఏసీఎస్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ**
అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్ గా నిలుస్తుంది అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయాన్ని పండుగ చేయ డానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందులో భాగంగా రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా, పంటల బీమా తదితర పథకాలతోయూ రైతన్నలను ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు సాధించారని గుర్తు చేశారు.
అంతేకాకుండా బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ రుణాలన్ని సెంట్రల్



బ్యాంక్ ద్వారా సహకార సంఘాలకు అందజేయడం జరుగుతుందన్నారు. సెంట్రల్ బ్యాంక్ కల్పించే బ్యాంకు సౌకర్యాలను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలని అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రైతులు, మహిళలు డీసీసీ బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ డీసివో సంజీవ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వరంగల్ డీసిసిబి బ్యాంక్ సిఈవో వజీర్ సుల్తాన్, తహసీల్దార్ సదానందం, ఎంపీడివో అనిల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమారస్వామి, ఏవో రాకేష్, పాలకవర్గ సభ్యులు, రైతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన విద్యార్థుల విద్య కోసం

# దరిచూపేవారేలేరా,,,!

-ఎల్లతరబడి పొలం గట్ల మీదుగనే రహదారా..!

-ఇంకాఎన్నాల్లీ వెతలు అంటున్న తల్లి దండ్రులు.



**వేలేరు/జూన్18(జర్నలిస్ట్ వార్త)**



హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని పీచర గ్రామశివారులోని వావిల్లకుంట తండా ప్రభుత్వ పాఠశాలకు, అంగన్ వాడీ కేంద్రానికి గిరిజన విధ్యార్థులు విద్యకోసం వెల్లాలంటే పొలం గట్ల మీదుగనే వెల్లాలా అని విద్యార్థులు విద్యార్థుల తల్లి దండ్రులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తుల అభిప్రాయం మేరకు గతంలో ఇదేగ్రామానికి చెందిన ఓదాత పాఠశాలకు, అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థలాన్ని దానం ఇచ్చారు కాని ఆపాఠశాలకు దారిలేక విద్యార్థులు విద్యను అభ్యసించడంకోసం ఏల్ల తరబడి పొలం గట్ల మీదుగా తల్లి దండ్రుల సహకారంతోనే వెల్లాల్సిన పరిస్థితి నెకొంటుందని చిన్నారులు పోటం గట్లమీదుగా వెల్లే క్రమంలో కాలు జారి పొలం వడిపోయి ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని తెలుపుతున్నారు. రాజకీయనాయకులు తమ పబ్బం గడుపుకోవడానకే మావద్దకువచ్చి ఓట్లు దండకుంటున్నారే తప్ప మాబాధలు పట్టించుకునేవారేలేరని ఆవేధన వ్యక్తం చేస్తున్నరు. ఇకనైనా ప్రజాప్రధినిధులు, అధికారులు స్పందించి విద్యార్థులకోసం రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

# సిట్ కార్యాలయానికి ట్యాపింగ్ బాధితులు

### ఫిర్యాదులు చేస్తున్న పలువురు వ్యక్తులు

హైదరాబాద్, **జూన్18(జర్నలిస్ట్ వార్త)** తెలంగాణలో సంచలనం సృష్టిస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో దర్యాప్తును సిట్ వేగవంతం చేసింది. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన బాధితులకు సిట్ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో వాంగ్మూలం ఇచ్చేందుకు జూబ్లీహిల్స్ సిట్ కార్యాలయానికి ఫోన్ ట్యాపింగ్ బాధితులు క్యూ కడుతున్నారు. బాధితుల నుంచి వాంగ్మూలాన్ని సేకరిస్తోంది సిట్. ఇందులో భాగంగా ఈరోజు (బుధవారం) టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చేందుకు సిట్ కార్యాలయానికి వచ్చారు. సిట్ అధికారుల నుంచి తన ఫోన్ ట్యాప్ అయినట్టు సమాచారం వచ్చిందని జైపాల్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. జైపాల్ నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనుంది సిట్. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్కరోజే 600 మంది ఫోన్లు ఒకేసారి ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. దీంతో ఫోన్లు ట్యాప్ అయిన వారిని బాధితులుగా గుర్తించి వారికి సమాచారం ఇస్తున్నారు సిట్ అధికారులు. ఈకేసులో సాక్షులుగా వారిచ్చే వాంగ్మూలాన్ని రికార్డు చేస్తున్నారు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా పెద్ద మొత్తంలో బాధితుల నుంచి వాంగ్మూలాన్ని సిట్ రికార్డు చేసినట్లు తెలుస్తోంది. ఈరోజు కూడా మరికొంత మంది బాధితులు సిట్ కార్యాలయానికి వచ్చి వాంగ్మూలాన్ని ఇస్తున్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం.

## అర్హులైన పేదలకే సంక్షేమపథకాలు -ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**ధర్మసాగర్/జూన్18(జర్నలిస్ట్ వార్త):**ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో కస్తూరిభా గాంధీ పాఠశాలలో 25లక్షల ఎస్డిఎఫ్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డు, 3లక్షల 50వేల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హై మాస్ లైట్లను అలాగే ముప్పారం గ్రామంలో 27లక్షల కూడా నిధులతో నిర్మించిన సిసి డ్రైన్ మరియు 20లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం ప్రారంభించారు.

అనంతరం ధర్మసాగర్ మండలం ముప్పారం శివారులోనీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీ డా.కాడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు.వంటగదిలో భోజనం, బియ్యం, కూరగాయలతో పాటు వంట సరుకులు, వసతులను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మమేకమై వారితో ముచ్చటించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో 10/10 సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తానని వారిని ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థినిలకు పౌష్టికాహారం అందించాలని వారు సూచించారు.అలాగే ముప్పారం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం గత 15ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని, గత పాలకులు ఏనాడూ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి ప్రతీ క్షణం నియోజకవర్గంపైనే నా ఆలోచన ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సహకారంతో 800కోట్ల అభివృద్ధి నిధులు తీసుకువచ్చానని, స్వయంగా ముఖ్యమంత్రి గారే వచ్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని ఇపుడు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు వెళు తున్నాని తెలిపారు. ఈ రోజు ముప్పారం గ్రామంలో సుమారు 80లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నామని అన్నారు. కేజీబీవి పాఠశాలలో 25లక్షల సిసి రోడ్డు, 3లక్షల 50రూపాయలతో హైమాస్ లైట్ల ప్రారంభోత్సవం అలాగే ముప్పారం గ్రామంలో 27లక్షల సిసి డ్రైన్, 20లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభించుకున్నామని తెలిపారు. అలాగే ముప్పారం గ్రామానికి 35 ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయని, త్వరలోనే మరో 35ఇల్లు మంజూరు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులు వీలైనంత తొందరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని, బిల్లుల ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎక్కడా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని అర్హత ఉన్నవారికి కచ్చితంగా ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలోనే నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పేద వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. నాకున్న ఏకైక ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి మాత్రమేనని నిజాయితీగా, అవినీతి లేని పాలన అందించాలన్నదే లక్ష్యం అని తెలిపారు. అందుకు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, ఆశీస్సులు నాపై, కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలని కోరారు.

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.**

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకువెళుతుందని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. నిరుపేదలకు ఉండేందుకు నీడ కల్పించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. మాట తప్పని మడమ తిప్పని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిరుపేద వర్గాలకు కూడు, నీడ కల్పిస్తుందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. మిగులు రాష్ట్రంగా ఏర్పాటైన తెలంగాణను బీఆర్ఎస్ సర్కార్ అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక ప్రతి నెలా వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలను సైతం కొనసాగిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రైతులకు రుణమాఫీ, సన్నబియ్యం, రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో పాటు యువతకు 59 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఈ స్థాయిలో ప్రజా సంక్షేమానికి కృషి చేసిన రాష్ట్రం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, డీఎంహెచ్వో అప్పయ్య, పీఆర్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ సదానందం, ఎంపిడివో అనిల్, ఏఈలు, మెడికల్ ఆఫీసర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్‌దే పైచేయి !

**జూన్18(జర్నలిస్ట్ వార్త)**

ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నా జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగి అగ్రనేతలు ముగ్గురు నేలకొరిగారు. ఈ ఎన్‌కౌంటర్‌తో జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల ఉలిక్కిపడింది. నాడు విప్లవ ఉద్యమానికి ఊతమిచ్చిన వెలిశాల.. నేడు శోకసంద్రంలో మునిగింది. ఇదే గ్రామానికి చెందిన మావోయిస్ట్ పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్ వార్ ఉద్యమంలోకి వెళ్లిన గాజర్ల రవి అంచెలంచెలుగా ఎదిగారు. దళ సభ్యుడి స్థాయి నుంచి కేంద్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వంతో మావోయిస్టులు జరిపిన శాంతి చర్చల్లో ప్రతినిధిగా ఉన్నారు. గాజర్ల రవిపై 25 లక్షల రివార్డు ఉంది. మొత్తంగా అగ్రనేతలు అంతా హతమువుతన్నారు. కేంద్రం ఏదైతే కోరుకుంటందో అదే జరుగుతోంది. నిజానికి పీపుల్స్ వార్ రాకతోనే గ్రామాల్లో పెత్తందారీ వ్యవస్థ అంతరించింది. దొరల సామ్రాజ్యానికి చెక్ పడింది. గడీల పాలన అంతమొందింది. ఊర్లో భూస్వాముల అఘాయిత్యాలు ఆగాయి. రాజకీయ నేతల దూకుడు తగ్గింది. ఏదైనా పనిచేయాలంటే రాజకీయ నాయకులు భయపడేవారు. కానీ ఇప్పుడు రాజకీయ నాయకుల పెత్తనం పెరిగింది. భయమన్నది లేకండా పోయింది. అఇకారంలోకి వచ్చి భూములను కబ్జా చేస్తున్నారు. అప్పనంగా అమ్ముకుంటున్నారు. తప్పుడు పనులు చేసే రాజకీయ నాయకులకు, బూకబ్జాదారులకు పీపుల్స్ వార్ హయాలో భయం ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే దళాలను చుట్టుముట్టి మట్టుబెడుతున్న కారణంగా మావోలు అంతరించి పోతున్నారు. ముఖ్యంగా మావోలను అంతమొందించాలని కేంద్రం కంకణం కట్టుకుంది. ఈ సమయంలో ఇక చర్చలకు తావు లేదన్న విధంగా కేంద్రం మొండిగా ఉంది. మావోలపైనే ఎందుకనో దూకుడుగా వ్యవహరిస్తోంది. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కానీ, మణిపూర్‌లో అల్లర్లు అణచివేయడంలో కానీ ఇంత దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని మహాధర్నాలు పలువురు నేతలు విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని పలువురు విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న వారు గళమెత్తారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా



చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. ‘మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం‘అని కూడా అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్య నైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని ,నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే..ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోలతో చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమన మేనని శాశ్వత పరిష్కారం కాదని గుర్తు చేశారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ,అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా ..నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని కూడా విమర్శలు గుప్పించారు. పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే అని విమర్శించారు. మొత్తంగా ఇప్పుడు కేంద్రం అనుకున్న విధంగా మావోలు అంతమొందించే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. అయితే దోపిడీ ఉన్నంతకాలం పోరాటం ఉంటుంది. రాజకీయ దోపిడీ ఉంటే తిరుగుబాటు తప్పదని చరిత్ర రుజువు చేసింది. రాజకీయ దోపిడీని అరికట్టాలి. జబ్బుకు చికిత్స చేయడం కన్నా అసలు జబ్బులే రాకుండా నిరోధించ గలగడం ముఖ్యమని వైద్యశాస్త్రంలో చెబుతారు. అందుకోసం కృషి చేయడం మంచిది. సమాజంలో ఉత్పన్నమయ్యే అశాంతికి, ఇతర సమస్యలకు పరిష్కారం చూపకుండా కేవలం మావోలను అణచివేస్తే సమస్య సమిసి పోదని గుర్తించాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా, ప్రజలు అసంతృప్తితో చేసే ఆందోళనలపై ప్రభుత్వం తమ బలాన్ని, బలగాలను ప్రయోగించడం వల్ల లాభం లేదు. ఉద్యమాలను, ఆందోళనలను ప్రతిష్ఠగా తీసుకొని ఎంత గొప్పగా వాటిని అణచివేశామో చెప్పుకోవడం సరికాదు. మార్చి 31 వరకు సంపూర్ణంగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ ప్రస్తుతం ఎక్కడైతే కేంద్రీకరించి పని చేస్తుందో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి వారిని మట్టుపెడుతున్న తీరుతో వారు అంతమొందడం ఖాయం కానీ...ప్రజల్లో గూడుకట్టుకున్న ఆందోళనలను మాత్రం అణచివేయడం సాధ్యం కాదని గుర్తించాలి.